

# మొనగాణ్ణే!

– ఇంద్రగంటి నరసింహమూర్తి

**అర్ధరాత్రి** పన్నెండు గంటలు.

ఒక అందగాడు రైలు దిగాడు.

టాక్సీ ఎక్కాడు. ఎక్కడికి వెళ్ళాలో చెప్పాడు. టాక్సీ రివ్వున దూసుకు పోసాగింది. అందగాడికి చల్లగాలికి చిన్నగా కునుకు కట్టేంది. కాస్సేపట్లో టాక్సీ నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశంలో ఆగింది. టాక్సీ డ్రైవరు టాక్సీ దిగాడు. అందగాడిని దిగమన్నాడు. ''ఊ. త్వరగా ఆ జేబులో డబ్బూ, చేతి వాచీ, పెట్టెలో ఇంకా ఉంటే డబ్బు బయటికి తియ్యి'' అని బెదిరించాడు. కదిలితే తన్నుతా నన్నాడు. 'డ్రైవర్ ఆజానుబాహువు. ఒక్క దెబ్బ కొడితే స్వర్గం చూడవచ్చు' అనుకున్న అందగాడు మరేమీ చేయలేక జేబులోని అయిదు వందలూ, చేతి డిజిటల్ వాచీ డ్రైవర్ చేతిలో పెట్టాడు.

''వెరీ గుడ్! దెబ్బలు తినకుండా డబ్బిచ్చేశావ్. మంచివాడివి. నే నెవర్నో తెలుసా! ఆటగాడిని. రాత్రి రైలు దిగిన పాసెంజర్సుతో ఆడుకోవడం నా హాబీ!'' అనేసి ఆటగాడు టాక్సీ ఎక్కాడు. టాక్సీ బయలుదేరింది. అందగాడు వెర్రివాడులా దిక్కులు చూడసాగాడు.

కొంచెం దూరం వెళ్ళిన టాక్సీ సడెన్ బ్రేక్‌తో ఆగిపోయింది. ఎదురుగా స్కూటర్. క్షణంలో ఏక్సిడెంట్ తప్పిపోయింది. స్కూటర్ అడ్డుగా ఉంది. మరుక్షణంలో మెరుపులా స్కూటర్ మీది మనిషి టాక్సీ డోర్ తెరిచి ఆటగాడివి బయటికి లాగాడు. స్కూటర్ మనిషి చేతిలో మెరుస్తూంది కత్తి. ''ఊ. తియ్ డబ్బు. మొత్తం డబ్బూ, చేతి వాచీ, మెడలో గోల్డ్ చెయిన్ తీసి నా చేతిలో పెట్టు. కదిలావంటే పొడిచి పారేస్తాను. నే నెవర్నో తెలుసా? పోటుగాడిని. దారి కాచి కత్తితో పొడిచి డబ్బులు సంపాదించడం నా వృత్తి. నాకూ, నీకూ శ్రమ తప్పాలంటే డబ్బిచ్చెయ్'' అని గద్దించాడు.

ఆటగాడికి కళ్ళు బైర్లు కమ్మాయి. చేసేదేమీ లేక సర్వం సమర్పించి చేతులు ఎత్తేశాడు. ''బుద్ధిమంతుడివి. టాక్సీ ఎక్కి వెనక్కు తిరిగి చూడకుండా పో!'' అని స్కూటర్ ఎక్కి దూసుకుపోగాడు.

స్కూటర్ కొంచెం దూరం వెళ్ళి పెద్ద శబ్దంతో ఆగిపోయింది. టైరు పంక్చరయింది. టైర్‌లోంచి ఒక గుండు దూసుకు పోయింది. ఏమయిందా? అని పోటుగాడు ఆలోచించేటంతలో ఒక మనిషి ప్రత్యక్షమయ్యాడు. వాడి చేతిలో పిస్తోలు ఉంది.

''నేనే గుండు పేల్చాను. టైరు పంక్చరయింది. డబ్బూ దస్కం బయటికి తీయి. లేకపోతే గుండు నీ గుండెలోంచి దూసుకు పోగలదు. నే నెవర్నో తెలుసా? వేటగాడిని. దారి కాచి డబ్బు దోస్తాను. ఎదిరిస్తే కాల్చి పారేస్తాను. ఈ ఏరియాలో మనకు తిరుగు లేదు. ఆలస్యం అమృతం విషం అన్నారు. లేట్ చేయడం నా కిష్టం ఉండదు. డబ్బు తీస్తావా? గుండు పేల్చనా?'' అని ఖరాఖండీగా అడిగేశాడు. పోటుగాడికి చమటలు పట్టసాగాయి. మరుక్షణంలో వాడి జేబులో డబ్బు వేటగాడి జేబుకు మారింది. వేటగాడి పిస్తోలుకు పని తగలలేదు. వేటగాడు వడివడిగా పక్క సందులోకి తిరిగి పరుగు లాంటి నడకతో ముందుకు పోసాగాడు. వేటగాడు ముందుకు దూసుకు పోతున్నంతలో—''ఆగు!'' అన్న కేక వినపడింది.

'నన్నెవడో ఆగమంటున్నాడా?' అని ఆశ్చర్యంతో వేటగాడు వెనుదిరిగి చూశాడు. ఎదురుగా తనకు గురి పెట్టి ఉంది తుపాకీ. అది పట్టుకున్న పెద్దమనిషి కాకీ దుస్తుల్లో ఉన్నాడు. 'పోలీసు చేతికి చిక్కామే!' అనుకున్నాడు వేటగాడు. కాన్‌స్టేబుల్ గంభీరంగా అన్నాడు: ''నే నెవర్నో తెలుసా? అందరికీ మొనగాడిని. తీయ్. జేబులో డబ్బూ గిట్రా తీసి నా చేతి కిచ్చెయ్. నేను గస్తీ తిరుగుతూ ఉంటాను. రోడ్డు మీద నడిచే వాళ్ళను దోచుకుని రాత్రివేళ రోడ్డెక్కాలంటే భయపడేలా చేస్తాను. చేతిలో ఏముందో చూశావా? ప్రభుత్వం వారిచ్చిన తుపాకీ. మిమ్మల్ని కాల్చి పారేయడానికి లైసెన్సుకూడా ఉంది. నాకు ఎదురు తిరిగావంటే కాల్చి పారేసి నువ్వో బందిపోటువని, తప్పించుకు పారిపోతూంటే ఆత్మరక్షణ కోసం కాల్చి పారేశానని స్టేట్‌మెంటిచ్చి నలుగుర్ని నమ్మిస్తాను. నన్ను స్టేట్‌మెంట్ ఇమ్మంటావా, నీ దగ్గర ఉన్నది ఇచ్చుకుంటావో నువ్వే తేల్చుకో'' అని బిగ్గరగా నవ్వాడు.

వేటగాడు వాడి దగ్గర ఉన్నది వదుల్చుకుని తిన్నగా ఇంటి ముఖం పట్టాడు.

అందరికీ మొనగాడు మరో 'కేసు' కోసం పక్క సందులోకి తిరిగాడు.